ఈ-పంటతో బహుళ ప్రయోజనాలు

- గ్రామాల్లో జోరుగా పంట నమోదు
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- మండలంలో 15 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు



తామరాడలో ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు



జగపతినగరంలో సాగు చేసిన వరి పంట

కిర్లంపూడి: ఆరుగాలం శ్రమించే రైతులను నిరంతరం కష్టాలు, నష్టాలు వెంటాడుతున్నాయి. విత్తనం నుంచి పంట చేతికి వచ్చే వరకు రైతుల పరిస్థితి దినదిన గండంగా ఉంటోంది. అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు నష్టాల బారిన పడుతున్నారు. కాగా ఈ-పంట నమోదుతో రైతులకు కొండంత భరోసా కలుగుతుంది. వరదలు, తుపానులు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టపోయిన రైతులకు ఈ-పంట నమోదు అండగా నిలుస్తోంది. ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు నష్ట పరిహారం, ప్రభుత్వం నుంచి సబ్సిడీలు అందుతాయి.

జోరుగా ఖరీఫ్ సాగు

గ్రామాల్లో ఖరీఫ్ సాగు పనులు ఊపందుకున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలోని సుమారు 14820 ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేస్తున్నారు. దీనిలో వరి పంట సుమారు 8356 వేల ఎకరాల్లోనూ, మిగతా 6464 ఎకరాల్లో చెరకు, ఆయిల్ పామ్, కొబ్బరి, అరటి, కూరగాయాలు, పూలు, పత్తి పంటలను సాగు చేస్తున్నారు.

ఈ-పంట నమోదు ఇలా...

రైతులు తాము పండిస్తున్న పంటలకు అధికారుల ద్వారా ఈ-పంట నమోదు చేసుకోవచ్చు. పంట నష్టం పరిహారం పొందాలన్నా, ఇతర పథకాలకు అర్హత కావాలన్నా ఈ-పంట నమోదు తప్పనిసరి. ఇందుకోసం సచివాలయ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు గ్రామాల్లో రైతుల పొలాలకు వెళ్లి పంటల సాగు వివరాలు సేకరిస్తారు. అనంతరం ప్రత్యేక యాప్‌లో రైతులు ఏయే పంటలు సాగు చేస్తున్నారో గుర్తించి అక్కడికక్కడే రైతు, పంట కలిపి ఫొటోను అప్‌లోడ్ చేస్తారు. ఏ సర్వే నంబర్‌లో ఎంత విస్తీర్ణంలో పంట సాగు జరుగుతుందో నమోదు చేస్తారు.

ఖరీఫ్ పంటలకు..

మండలంలోని 26 సచివాలయాల పరిధిలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఈ-పంట నమోదు చురుగ్గా సాగుతోంది. అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట వివరాలు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని సుమారు 2 వేల ఎకరాల్లో ఈ-పంట నమోదు పూర్తి చేశారు. ఈ ప్రక్రియను తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి పర్యవేక్షిస్తున్నారు.

లాభాలు

ఈ-పంట నమోదుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. అన్నదాత సుఖీభవ పథకం, సున్నా వడ్డీ రుణాలు, కనీస మద్దతు ధర, ఉచిత పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల నష్టపరిహారం తదితర మేలు జరుగుతుంది.

ఈ-పంట నమోదు తప్పనిసరి



ఈ-పంట నమోదు చేసుకునే రైతులకు ప్రభుత్వ పథకాలతో పాటు సాయం అందుతుంది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలకు నష్టం వాటిల్లితే ఈ-పంట నమోదు చేసుకున్న వారికి మాత్రమే పరిహారం అందుతుంది. ఈ-పంట నమోదు చేసుకోని రైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం దక్కదు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు విధిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలి. అధికారులు ఈ-పంట నమోదు చేయడానికి వచ్చే సమయంలో రైతులు అందుబాటులో ఉండాలి.

-సుధామాధురి, వ్యవసాయాధికారి, కిర్లంపూడి మండలం

పుష్కర కాలువకు వరద ముప్పు



పుష్కర కాలువలో గరిష్ట ఎత్తుకు చేరిన నీరు



స్లూయిజ్ నుంచి లీకవుతున్న నీరు

తుని రూరల్: మండలంలోని టి.తిమ్మాపురం సమీపంలో పుష్కర కాలువకు ముప్పు పొంచి ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు కాలువలో ప్రవహిస్తోంది. కాలువ గరిష్ట ఎత్తుకు వరదనీరు చేరింది. టి.తిమ్మాపురం నుంచి జాతీయ రహదారికి వచ్చే మార్గంలో రాకపోకలకు అంతరాయం లేకుండా ఉండేందుకు అండర్ కెనాల్ ఏర్పాటు చేశారు. నీరు ఉధృతంగా ప్రవహిస్తుడడంతో ఇప్పటికే రోడ్డుపై స్వల్పంగా వరనీరు చేరింది. కాలువలో గరిష్టంగా వరదనీరు ప్రవహిస్తుండడంతో గట్టు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మరో పక్క అండర్ కెనాల్ నుంచి నీరు లీకవుతుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉందని స్థానికులు పేర్కొన్నారు. రాత్రివేళలో భారీ వర్షం కురిస్తే పుష్కర కాలువ గట్టు తెగిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువ గట్టు పటిష్టతకు చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



వల్లూరులో ప్రతిష్ఠించిన శ్రీలక్ష్మీ గణపతి విగ్రహం

తుని రూరల్: మండలంలోని వల్లూరులో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. శనివారం ఆలయాన్ని ప్రారంభించిన అర్చకులు, వేదపండితులు ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ చేశారు. స్వామివారికి కుంభాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కొత్తూరు తేజో భాస్కరరావు దంపతుల ఆర్థిక సాయంతో ఆలయాన్ని నిర్మించి, విగ్రహాలను నెలకొల్పినట్టు నిర్వాహకులు తెలిపారు. దాతలను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీలక్ష్మీ గణపతిస్వామిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరం సీతంపేటలోని లక్ష్మీ వినాయక ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది.



ధర్మవరంలో స్వామివారిని దర్శించుకుంటున్న మురళీకృష్ణంరాజు

అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీకి ఆయన రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ముదునూరి సీతారామరాజు, గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల, గదుల శివ, బొల్లు నాగేశ్వరరావు, ఉర్లంకల చంద్రరరావు, గింజాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు పరికరాల అందజేత



దానవాయిపేటలో మత్స్యకారులకు ట్రాన్స్‌ఫాండర్ యంత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తొండంగి: వేట సమయంలో ఉపయోగపడే ట్రాన్స్‌ఫాండర్ యంత్రాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య సూచించారు. తొండంగి మండలంలోని దానవాయిపేట మత్స్యకార కార్యాలయంలో 36 మంది మత్స్యకారులకు నూరుశాతం రాయితీపై మంజూరైన ట్రాన్స్‌పాండర్స్ యంత్రాలను ఆదివారం ఎమ్మెల్యే అందజేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లే సమయంలో బోటుకు ఈ యంత్రాలను అమర్చుకోవాలని సూచించారు. మొబైల్ అప్లికేషన్‌లో ట్రాన్స్‌ఫాండర్ యంత్రాన్ని ఎస్ఓఎస్ బటన్ నొక్కడం ద్వారా వినియోగించవచ్చని ఎఫ్‌డీఏ సీహెచ్ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఈ యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



మరిడమ్మ ఆలయంలో భక్తులకు అన్నదానం

పెద్దాపురం: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే పెద్దాపురం మరిడమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వారంవారం నిర్వహించే అన్నదానానికి భక్తులు బారులుతీరారు. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ గత నెల ఆషాఢ మాస జాతర ఉత్సవాల్లో భాగంగా అన్నదానాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. ఈ వారం నుంచి మళ్లీ దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అమ్మవారి అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఆమె కోరారు

జోరువాన



ఏలేశ్వరంలో చెరువును తలపిస్తున్న ప్రభుత్వ పాఠశాల ఆవరణ



అచ్చంపేట పొలాల్లో ఏరులై పారుతున్న వరదనీరు

- ఎడతెరిపి లేకుండా వర్షం
- పల్లపు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన పంట పొలాలు

ఏలేశ్వరం: అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు, పంటపొలాలు నీటమునిగాయి. జనం ఇళ్లకే పరిమితమయ్యారు. రోడ్లపై వర్షపునీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వ ఉండిపోయింది. మండలంలోని యర్రవరం, తిరుమాలి, సిరిపురం తదితర గ్రామాల్లో పంట పొలాలు నీటమునగడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

తుని మండలంలో భారీ వర్షం

తుని రూరల్: అల్పపీడనం ప్రభావంతో మండలంలో భారీ వర్షం కురిసింది. ఆదివారం తెల్లవారుజాము నుంచి వర్షం కురిస్తునే ఉంది. పరివాహక ప్రాంత కొండపై కురుస్తున్న వర్షపునీరు నదిలోకి చేరడంతో తాండవ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. తుని వద్ద ముఠా చానల్, గ్రోయిన్ (మినీ రిజర్వాయర్లు) కట్టడాలపై నుంచి వరదనీరు ప్రవహిస్తూ పెంటకోట వద్ద సముంద్రంలో కలుస్తోంది. వరదనీరు వచ్చి చేరడంతో పుష్కర కాలువ నిండుగా ప్రవహిస్తోంది. చెరువుల్లోకి సైతం వరదనీరు చేరుతుంది. భారీగా కురుస్తున్న వర్షాలు మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ నాట్లకు మేలు చేస్తాయని వ్యవసాయ అధికారి బి.అశోక్ కుమార్ తెలిపారు. మరో పక్క తాండవ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు ఘననీయంగా పెరగడంతో అత్యవసరరమైతే అదనపు జలాలను నదిలోకి విడుదల చేస్తామని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. నదీపరివాహక ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

విస్తారంగా వర్షాలు

శంఖవరం: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఎడతెరిపి లేకుండా రోజంతా వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో వరి పొలాలు నీట మునిగాయి. శంఖవరం, కత్తిపూడి, కొతంగి, మండపం గ్రామాల్లో పెద చెరువులు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. ఈదురుగాలులకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. కాగా వర్షాలకు తడిస్తే జ్వరం, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

రోజంతా వాన

ప్రత్తిపాడు: అల్పపీడన ప్రభావంతో ఆదివారం రోజంతా వర్షం కురిసింది. బీడువారిన భూముల్లో సమృద్ధిగా జలాలు చేరాయి. సాగునీటి చెరువులకు జలకళ వచ్చింది. రైతులు ఊడ్పులకు ఉపక్రమించారు. సుద్దగెడ వాగుకు వరద వచ్చింది. ప్రత్తిపాడులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో వర్షపు నీరు రోడ్లపై పారుతోంది. స్థానిక తోట వీధి, కొత్తపేట తదితర వీధుల్లో నీరు నిలిచిపోయింది. స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్, పంచాయతీ కార్యాలయం వెనుక వీధిల్లో వర్షపు నీరు పోయే మార్గం లేక చెరువులా రూపాంతరం చెందాయి.

ఏకదాటిగా..

ప్రత్తిపాడు రూరల్: అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా ఆదివారం విస్తారంగా వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి వర్షం ఏకదాటిగా కురుస్తూనే ఉంది. వర్షం ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. ఇ.గోవకరంలోని సుబ్బారెడ్డి సాగర్, కిత్తమూరిపేటలోని కట్టుచింతల ప్రాజెక్టులు, పంట చెరువుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. వర్షం ప్రభావంతో జనజీవనం స్తంభించిపోయింది. అత్యవసర పనులు ఉంటే మినహా జనం బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. రైతులు పూర్తిగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.



యర్రవరంలో నీటమునిగిన పంటపొలం



లంపకలోవ పంట పొలాల్లో చేరిన నీరు



ధర్మవరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న సుద్దగెడ్డ వాగు



తొండంగి మండలం దానవాయిపేట సముద్రతీరంలో ఎగసిపడుతున్న అలలు

తీరంలో అలజడి

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలోని సముద్రతీరంలో అలల ఉధృతి పెరిగింది. దానవాయిపేట, కొత్తపోడిపల్లిపేట, అద్దరిపేట తదితర సముద్ర తీరాల్లో అలలు రెండు నుంచి మూడు మీటర్లు మేర ఉవ్వెతున ఎగసిపడుతున్నాయి. మత్స్యకారులు తీరంలో లంగరు వేసిన బోట్లను ఒడ్డున సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. అల్పపీడనం, తుపాను హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు సూచించారు. ఇప్పటికే సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సమాచారం అందించామన్నారు.

భారీ వర్షం

అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా మెట్ట, తీరప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. బెండపూడి, ఎ.కొత్తపల్లి, గోపాలపట్నం, ఏవీ నగరం, సీతారాంపురం తదితర గ్రామాల్లో శివారు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. శృంగవృక్షం తొండంగి ప్రధాన రహదారిలో నాయిబ్రాహ్మణ కాలనీ వద్ద ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదనీరు రోడ్డుపైనే ప్రవహించడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

క్లుప్తంగా

సర్వతోముఖ వికాస తరగతులు



సర్వతోముఖ వికాస తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

కిర్లంపూడి: మండలంలోని చిల్లంగి పెరిక రామాలయంలో ఆదివారం సర్వతోముఖ వికాస తరగతులు నిర్వహించారు. తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో స్థానిక, పరిసర గ్రామాల చిన్నారులకు అధ్యాత్మికతపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు అధ్యాత్మికతపై అవగాహన పెంచేందుకు ప్రతి ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు దిడ్డి సునీత తెలిపారు. కార్యక్రమంలో దిడ్డి గణపతి, సుబ్బారావు, సంఘన వీరబాబు, మురళీకృష్ణ, గోడే బుజ్జి, సంతోష్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కిర్లంపూడిలో కంటి వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న తోట నరసింహం

కిర్లంపూడి: స్థానిక సాంబశివ ఆసుపత్రిలో గ్రామ మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు అధ్యక్షతన ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం సందర్శించారు. కిరణ్ కంటి ఆసుపత్రి డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. తోట నరసింహం రోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వైద్యుడు వేగి సాంబశివ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు తోట బాబ్జీ, నియోజకవర్గ ఇంటిలెక్చువల్ విభాగం అధ్యక్షుడు వేగి రామకృష్ణ, పార్టీ మండలాధ్యక్షుడు పెనగంటి రాజేష్, అడారి మహేష్, కర్రి వెంకట రమణమూర్తి, పీలా సుబ్రహ్మణ్యం, మక్కా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన జిల్లా ఎస్పీ



సత్యదేవుని సన్నిధిలో వేదపండితుల ఆశీస్సులు పొందుతున్న ఎస్పీ బిందు మాధవ్ దంపతులు

అన్నవరం: జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి రత్నగిరిపై సత్యదేవుని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఈఓ వీర్ల సుబ్బారావు అందజేశారు.

110 మందికి వైద్య పరీక్షలు



నీలాద్రిరావుపేటలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేటలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ములంపాక సురేష్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన ఆకాశ్ హాస్పటల్ వైద్య సిబ్బంది సుమారు 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామ నాయకులు కందుల భజన్నారాయణ (జెమ్మి), చిట్యాల బాబ్జి, నక్కా శ్రీను, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు అపూర్వ గౌరవం



వెంకట భాస్కరరామూర్తి దంపతులను సత్కరిస్తున్న పల్లం రాజు తదితరులు

కిర్లంపూడి: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు అపూర్వ గౌరవం దక్కుతుందని మాజీ మంత్రి ఎంఎం పల్లంరాజు అన్నారు. గెద్దనాపల్లి గ్రామానికి చెందిన పంతం వెంకట భాస్కరరామూర్తి రాజమంహేంద్రవరంలోని అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియో వైద్య కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా 33 ఏళ్ల విధులు నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు గెద్దనాపల్లిలో ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేసారు. వెంకట భాస్కరరామూర్తి దంపతులను పల్లం రాజు తదితరులు పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రటరీ మల్లిపూడి రాంబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, పీసీసీ సభ్యులు ధరణాలకోట శ్రీను పాల్గొన్నారు.

సత్యదేవుని పల్లకీ సేవ



పల్లకీపై సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల పల్లకీ సేవ ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తూర్పురాజగోపురం లోపల ప్రాకారంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అర్చకుడు కంచిబట్ల సాయి స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి పల్లకీ సేవ ప్రారంభించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లను మూడుసార్లు ఆలయ ప్రాంగణంలో పల్లకీపై ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా ప్రతి ఆదివారం స్వామి, అమ్మవార్లను టేకు రథం మీద ఊరేగిస్తున్న విషయం తెలిసిందే. కాగా ఈ వారం వర్షం కురుస్తుండడంతో రథసేవ రద్దు చేసి పల్లకీమీద గోపురం లోపల ప్రాకారంలో స్వామి, అమ్మవారిని ఊరేగించారు.

డ్రైన్లలో పూడిక తీత

కిర్లంపూడి: జగపతినగరంలోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడిక, చెత్త, వ్యర్థాలను ఆదివారం పొక్లెయిన్‌తో తొలగించారు. ఏకదాటిగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద రోడ్లపై ప్రవహించే ప్రమాదం ఉండడంతో సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత ఆదేశాల మేరకు సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. వార్డు సభ్యుడు గుడాల రాంబాబు పనులను పర్యవేక్షించారు.

ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ వేడుకలు

గండేపల్లి/జగ్గంపేట: ఏపీయూడబ్ల్యూజే 68వ ఆవిర్భావ వేడుకలు జగ్గంపేటలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఏపీయూడబ్ల్యూజే నేతలు జెండాను ఆవిష్కరించారు. జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా పని చేయాలని నిర్ణయించారు. సీనియర్ పాత్రికేయులు పెనుగాడి సూరిబాబు, రాయుడు బాబ్జి, చింతల రాంబాబు, నేదూరి శ్రీధర్, సుంకర శ్రీను, శేఖర్, వల్లభశెట్టి శ్రీను, తదితరులను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వట్టూరి వీరబాబు, చిక్కాల మణికంత, రమ్య, నాని, మధు, బాబి, అరుణ, వీరబాబు, బాబీ, పాల్గొన్నారు.

పర్వత చిట్టిబాబుకు ఘన నివాళులు



చిట్టిబాబు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాపనమ్మ, ఎంపీపీ తదితరులు

శంఖవరం: గ్రామంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే పర్వత చిట్టిబాబు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పర్వత బాపనమ్మ, ఎంపీపీ పర్వత రాజుబాబు తదితరులు చిట్టిబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి చిట్టిబాబు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పర్వత జానకీదేవి, బొమ్మిడి చిట్టిబాబు, రేలంగి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.